RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 280 గురువారం 27 ఆగష్టు 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥ 1/-


### తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలకు ఛాన్స్.. ఈ జిల్లాలకు అలర్ట్, హెచ్చరికలు జారీ

తెలంగాణలో మరోసారి వర్షాల తీవ్రత పెరిగే అవకాశ ముందని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. తూర్పు, దక్షిణ జిల్లాల్లో రాత్రి నుంచి ఉదయం వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి–కొత్తగూడెం, ములుగు, నల్గొండ, యాదాద్రి, వరంగల్, భూపాలపల్లి జిల్లాలకు వర్ష సూచన ఉందని చెప్పారు. పశ్చిమ, ఉత్తర, మధ్య తెలంగాణలో చెదురుమదురు వర్షాలు పడొచ్చునని అంచనా వేశారు. హైదరాబాద్‌లోనూ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు.

### హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు తీపి కబురు.. త్వరలోనే అందుబాటులోకి అదనపు కోచ్‌లు

హైదరాబాద్ మెట్రో ట్రైన్ ప్రయాణికులకు తీపి కబురు. అదనపు కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను హెచ్‌ఎంఆర్ఎల్ వేగవంతం చేస్తోంది. కొత్తగా 10 కోచ్‌లను సమకూర్చాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించగా.. సాంకేతికంగా అనుకూల మైన కోచ్‌ల ఎంపికపై డీఎంఆర్సీ సహకారం తీసుకోనున్నారు. డీఎంఆర్సీ కన్సల్టెన్సీ కొటేషన్లను అధికారులు పరిశీలిస్తున్నారు. దేశీయ తయారీ సంస్థలతోనూ సంప్రదింపులు కొనసాగుతున్నాయి. మరోవైపు ఎంజీబీఎస్ –చాంద్రాయణగుట్ట 7.5 కి.మీ. పాతబస్తీ మెట్రో మార్గానికి సంబంధించిన ఆస్తుల సేకరణ తుది దశకు చేరింది.

## రాజీనామాకు కొండా నో...!

– మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణే పరిష్కారమా?

– మంత్రి పదవిపై అంచనాలు, లెక్కల్లో ఆశావహులు..



కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించడం తప్పదనే భావనకు వచ్చింది రేవంత్ సర్కార్. అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఆమెపై వేటు పడనుంది. అయితే ఆమె అధిష్టానం నుంచి వచ్చే సందేశం ఎలా ఉండబోతుందనే విషయాన్ని మౌనంగా గమనిస్తున్నారు. మరో ఐదారు రోజుల పాటు ఢిల్లీ నుంచి ఎలాంటి సంకేతాలు రాకపోతే.. మళ్లీ మంత్రిగా ఆమె విధుల్లో యాక్టివ్ కానున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ అధిష్టానం కొండా సురేఖను తప్పించాలని డిసైడ్ అయితే ... మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిందిగా సూచిస్తుంది.

## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

### ట్రావెల్స్ బస్సులోని ఆరుగురు మృతి.. పలువురికి గాయాలు..



3 లో

# నేపాల్ విపత్తు..





2 లో

నేపాల్ లో అకస్మిక వరదలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 46 మంది ప్రాణాలు కోల్పోగా.. 400 మంది అదృశ్యమయ్యారు. గల్లంతైన వారిలో 105 భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే లేటెస్ట్ అప్డేట్స్ ప్రకారం.. సద్గురు ఈషా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 77 మంది యాత్రికులు వరదల్లో చిక్కుకుని గల్లంతైనట్లు తెలుస్తోంది. దీంతో వారి కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కైలాస మానససరోవర యాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో చైనాలోని టిబెట్ ప్రాంతానికి చెందిన గైరోంగ్ వద్ద వీరంతా ప్రమాదానికి గురైనట్లు సమాచారం. అక్కడ ఉన్న ఇమ్మిగ్రేషన్ కార్యాలయం వద్ద యాత్రికులు వేచి ఉన్న సమయంలో ఒక్కసారిగా భయంకరమైన వరద ముంచెత్తింది. వరద నీటి ఉధృతికి ఇమ్మిగ్రేషన్ భవనంతో పాటు ఆ పట్టణంలోని చాలా భాగం పూర్తిగా నీట మునిగిపోయింది. ఈ విషాదకర సంఘటనపై ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇమ్మిగ్రేషన్ వద్ద ఉన్న భక్తుల ఆచూకీపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం తమకు అందలేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్న తమ స్వచ్ఛంద కార్యకర్తలు, సహాయక బృందాలు బాధితులను కాపాడేందుకు శాయశక్తులా యత్నిస్తున్నాయని అన్నారు. ఎంతటి ప్రమాదానికైనా వెనకాడకుండా అధికారులతో కలిసి సహాయక చర్యల్లో పాలుపంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నేపాల్ లోని మానససరోవం యాత్రకు ఈషా ఫౌండేషన్ తర్వాత 21 బృందాలు వెళ్లినట్లు సద్గురు తెలిపారు. వీరిలో 495 మంది భక్తులు ఇప్పటికే సురక్షితంగా ఇళ్లకు చేరుకోగా..

## నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు బిగ్ అలర్ట్!

నేపాల్‌లో సంభవించిన భారీ వరదల కారణంగా అక్కడ చిక్కుకున్న లేదా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ వాసులకు అవసరమైన సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. నేపాల్‌లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అక్కడ ఉన్న తెలంగాణ వాసులకు అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



2 లో

## భారీగా పెరుగుతున్న సన్న బియ్యం ధరలు..

### క్వింటాకు రూ.1200 వరకు పెరుగుదల, కారణం ఇదేనా..?

### భారీగా పెరుగుతున్న సన్న బియ్యం ధరలు క్వింటాకు రూ.1200 వరకు పెరుగుదల బ్లాక్ మార్కెట్ కారణంగానే ధరలకు రెక్కలు

తెలంగాణలో సన్న బియ్యం ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. రేషన్ కార్డుల ద్వారా పేదలకు ఉచితంగా సన్నబియ్యం ఇస్తుండటం తో మెదట్లో ధరలు తగ్గినా.. గత రెండు నెలలుగా వ్యాపారులు వరుసగా ధరలు పెంచుతుండటంతో మధ్యతరగతి, సామాన్య కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. హెచ్ఎం టీ, బీపీటీ, తెలంగాణ సోనా, సాంబా, జై శ్రీరామ్ వంటి రకాల ధరలు క్వింటాల్‌కు రూ.800 నుంచి రూ.1200 వరకు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, వరి సాగు తగ్గుతుందన్న అంచనాలను వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్న ఆరోపణలు వినిపి స్తు న్నాయి. ఈ ఏడాది పంట తగ్గుతుం దని, సన్న రకాల బియ్యానికి కొరత ఏర్పడుతుందని ప్రచారం జరగడంతో ముందుగానే భారీగా నిల్వలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగా మార్కెట్‌లో కృత్రిమ కొరత ఏర్పడి ధరలు పెరుగుతు న్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన తర్వాత కొంతకాలం మార్కెట్‌లో ధరలు తగ్గాయి. హెచ్ఎంటీ, కర్నూల్ మసూరి, జై శ్రీరామ్, ఆర్ఎన్ఆర్, సాంబా రకాల ధరలు క్వింటాల్‌కు దాదాపు రూ.1000 వరకు తగ్గాయి. అయితే జూలై నుంచి పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ప్రస్తుతం నాణ్యత, పాత పంట, పాలిషింగ్, బ్రాండ్‌ను బట్టి హోల్‌సేల్ మార్కెట్‌లో సన్న బియ్యం క్వింటాల్ ధర రూ.5400 నుంచి రూ.7,000 వరకు పలుకుతోంది. రిటైల్ మార్కెట్‌లోనూ ధరల పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. సన్న బియ్యం కిలో ధర రూ.55 నుంచి రూ.75 వరకు ఉండగా.. ప్రీమియం ప్యాకెట్ రకాల ధరలు రూ.65 నుంచి రూ.75 వరకు ఉన్నాయి. మహబూబాబాద్‌లో జూన్‌లో క్వింటాల్‌కు రూ.4600గా ఉన్న హెచ్ఎంటీ ధర ఆగస్టులో రూ.5500కు చేరింది. జై శ్రీరామ్ ధర రూ.5600 నుంచి రూ.6300కు పెరిగింది. మరోవైపు ప్రభుత్వ సంస్థల బియ్యం విక్రయాలపైనా విమర్శలు వస్తున్నాయి. ఎఫ్‌సీఐ ఇథనాల్ డిస్టిలరీలకు భారీగా బియ్యం విక్రయించడం, మిల్లింగ్ కోసం కేటాయించిన ధాన్యం ఇతర రాష్ట్రాలు, విదేశాలకు తరలుతు న్నారన్న ఆరోపణలు మార్కెట్‌లో నిల్వలపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వినియోగదారుల్లో నెలకొంది.

## నిన్న చెక్కర, ఉల్లి.. నేడు నిమ్మ.. ధరలకు రెక్కలొస్తున్నాయ్..

## ఇక సామాన్యులకు చుక్కలే!



పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరల భారం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే వంట నూనెలు, ఇతర నిత్యావసర వస్తువులు ధరలు భారీగా పెరగ్గా.. చక్కెర, ఉల్లిపాయల ధరలు కూడా పెరిగాయి.. తాజాగా.. ఈ బాటలో నిమ్మకాయ కూడా చేరింది. నిమ్మ ధరలుసైతం ఒక్కసారిగా పెరిగాయి. తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ మార్కెట్లో ఉల్లి, పంచదార ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో రోజువారీ కిరాణాల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. గతంలో కిలో రూ.25 నుంచి రూ.35 మధ్య లభించిన ఉల్లిపాయలు.. ప్రస్తుతం.. కిలో రూ.55 నుంచి రూ.70 వరకు చేరింది. అలాగే చెక్కర ధర కూడా పెరిగింది. గతంలో కిలో చెక్కర రూ.45 నుంచి రూ.48 వరకు ఉండగా.. ప్రస్తుతం కిలో చెక్కర రూ. 65 నుంచి రూ. 70కి పెరిగింది. ఇదేబాటలో నిమ్మకాయ కూడా చేరింది. నిమ్మకాయ ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి.తెలుగు న్యూస్ని మ్మకాయల ధరలకు రెక్కలొచ్చాయి. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంట దిగుబడులు తగ్గడం, మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో ధరలు పెరిగాయి. ఏప్రిల్, మే నెలల్లో డజను ధర రూ. 100 పలికింది. జూన్, జులై నెలల్లో రూ.30 నుంచి రూ. 40వరకు చేరింది. అయితే, నాలుగైదు రోజుల నుంచి నిమ్మ ధర రికార్డు స్థాయిలో పెరగడమే కాకుండా ఏకంగా డజను రూ. 120కు చేరడంతో వినియోగదారులు బెంబెలెత్తుతున్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరగడంతో అల్లాడుతున్న వినియోగదారునికి ఆకాశాన్నంటుతున్న నిమ్మ ధరలు శరాఘాతంగా మారాయి.

## ట్రాఫిక్ చలాన్లు కట్టకపోతే ఫాస్టాగ్ నుంచి డబ్బులు కట్.. హైదరాబాద్ పోలీసుల బిగ్ ప్లాన్!

హైదరాబాద్‌లో ట్రాఫిక్ చలాన్ల వసూళ్లకు టెక్నాలజీని ఉపయోగించే సరికొత్త విధానాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వాహనదారుల నుంచి జరిమానాలను ఫాస్టాగ్ ద్వారా ఆటోమేటిక్‌గా వసూలు చేసే ప్రతిపాదనపై హెచ్ఎండీఏతో చర్చలు జరుపుతున్నారు. పెండింగ్ ఈ–చలాన్లను తగ్గించడం, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడాన్ని కంట్రోల్ చేయడమే ఈ కొత్త విధానం ప్రధాన ఉద్దేశమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ కొత్త విధానానికి సంబంధించి.. అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.




2 లో

## అసమ్మతి అధిష్టానంపై...

### అసంతృప్తి మీడియాపై! మీడియాను టార్గెట్ చేస్తే పలుచనయ్యేది లీడర్లే..



ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టుగానే ఉంది కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శల తీరు. నిన్నటి దాకా ప్రభుత్వాన్ని, సీఎంను టార్గెట్ చేసి మాట్లాడిన రాజగోపాల్‌రెడ్డి ఇవాళ మీడియా మీద పడ్డాడు. ప్రత్యేకించి ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై. రాధాక్రిష్ణ వ్యవహార శైలిపై. ఆ మీడియాలో ప్రత్యేకించి తనపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారనేది ఆయన ప్రధాన ఆరోపణ. ఆంధ్రా మీడియా ఇక మాకవసరం లేదన్నారాయన. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మా మీడియా మాకు చాలు అనడం.. మీ మీద ఆధారపడాల్సిన అసవరం మాకు లేదు.. అనే కామెంట్స్ వరకు ఓకే గానీ మేము వంద పేపర్లు, వంద చానెళ్లు పెట్టుకోగలుగుతామని అనడమే మరీ అహంతో కూడిన కామెంట్స్‌గా చర్చకు వచ్చాయి.

2 లో

## ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్లకు గౌరవం.. రేవంత్ రెడ్డిని కలిసిన గాయత్రి-త్రిసా

సీఎం రేవంత్ రెడ్డితో భేటీ

బ్యాడ్మింటన్ ఛాంపియన్లకు ఘన సన్మానం

మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్ష

ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించి భారత్‌కు గర్వకారణంగా నిలిచిన బ్యాడ్మింటన్ ఛాంపియన్లు గాయత్రి గోపిచంద్, త్రిసా జాలీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశానికి జాతీయ ప్రధాన కోచ్ పుల్లెల గోపిచంద్ ఆధ్వర్యంలో

3 లో

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక



## సంపాదకీయం

# రోగం ఒకటైతే నీతి ఆయోగ్ మందు మరొకటి

మన దేశంలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న సుమారు 8.7 కోట్ల మంది యువత "నో ఎడ్యుకేషన్, ఎర్నింగ్స్, ట్రైనింగ్ (నీట్)" (చదువుకోవడం, ఉద్యోగం చేయడం లేదా శిక్షణ పొందడం) లేదని నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకటించింది. వీరు కాక మరో 2 కోట్ల మంది యువతకు ఏ ఉద్యోగం లేదని కూడా ఈ నివేదిక పేర్కొంది. సుమారు 11 కోట్ల యువ శక్తి ఇలా వుండడం తీవ్ర ఆందోళనకరం. 2021లో నిర్వహించిన 78వ విడత జాతీయ నమూనా సర్వే లెక్కల ఆధారంగా 'వికసిత్ భారత్-2047 కోసం నైపుణ్యాభివృద్ధిని పునఃసమీక్షించడం' అనే రిపోర్టును నీతి ఆయోగ్ రూపొందించింది. ఈ నివేదిక అంచనాలకు కారణమైన అంశాలన్నీ ఈ ఐదు సంవత్సరాల్లో సాధించిన పురోగతి ఏమీ లేనందున ఈ అంకెలు మరింతగా దిగజారే వుంటాయి. మార్చి 2026లో, అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం వారి 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026' నివేదిక ప్రకారం 15-25 సంవత్సరాల మధ్య వయస్సుగల యువతలో దాదాపు 40 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని, పట్టభద్రులలో 7 శాతం మంది మాత్రమే ఒక సంవత్సరంలోపు శాశ్వత (పర్మినెంట్) ఉద్యోగం పొందగలుగుతున్నారని పేర్కొంది. పట్టభద్రులలో 8.25 శాతం మంది మాత్రమే వారి అర్హతలకు అనుగుణమైన ఉద్యోగాలు పొందుతున్నారని నీతి ఆయోగ్ నివేదిక కూడా పేర్కొంది. ప్రపంచ నాలుగో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామని పాలకులు చెప్పే మాటలకు, యువత ఎదుర్కొంటున్న ఉపాధి కొరతకు ఎంత వ్యత్యాసం వుందో ఈ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఇందుకు నీతి ఆయోగ్ సూచించిన పరిష్కారాలు మాత్రం రోగమొకటైతే, మందు మరొకటిలాగ ఉంది. మారుతున్న సాంకేతికత, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కార్మికులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడమే ఈ నివేదిక లక్ష్యంగా నీతి ఆయోగ్ పేర్కొంది. దేశంలో 65.4 కోట్ల మంది (జనాభాలో 45.1 శాతం మంది) శ్రామిక శక్తిగా వున్నారు. ఇందులో 29.2 కోట్ల మంది (44.7 శాతం) వ్యవసాయం మీద ఆధారపడి వున్నారు. వ్యవసాయేతర రంగాల్లో వున్న 34.2 కోట్ల మందిలో సర్వీసు రంగం (అన్ని రకాల సర్వీసు సెక్టార్లు)లో 19 కోట్ల మంది, నిర్మాణ రంగంలో 7.6 కోట్ల మంది, తయారీ రంగంలో 7.2 కోట్ల మంది వుండగా మైనింగ్, క్వారీ, విద్యుత్, నీటి రంగాల్లో 49 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని ఈ నివేదిక తెలిపింది. 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సుగల యువతను ఐదు విభాగాలుగా వర్గీకరించి పరిశీలించారు. అవి ఒకటి పాఠశాల విద్య, రెండు ఉన్నత విద్య, మూడు రెగ్యులర్, నాన్-రెగ్యులర్ పని (ఫార్మల్- నాన్ ఫార్మల్), నాలుగు విద్య, ఉపాధి, శిక్షణలో లేని యువత, ఐదు మహిళలు. ప్రస్తుత యువతకు నైపుణ్యం తగినంతగా లేదంటూ "డిగ్రీలను బట్టి కాకుండా, నైపుణ్యాలను బట్టి ఎంచుకోండి" అని కంపెనీలకు ఈ నివేదిక సూచించడం ద్వారా నీతి ఆయోగ్ లక్ష్యం స్పష్టమైంది. "శ్రామికులు, యువత నైపుణ్యాలను తిరిగి నేర్చుకోవడం, స్వయం ఉపాధి మార్గాలు పొందడం, స్థానిక డిమాండ్, అభివృద్ధి చెందుతున్న రంగాలకు అనుగుణంగా ఉండే శిక్షణల ఎంపికల అవసరం చాలా వుంది. పాఠశాల స్థాయిలోనే "నైపుణ్య శిక్షణ ప్రారంభమై, విద్యార్థులలో పాతుకుపోవాలి" అని ఈ సిఫారసు చేసింది.'విద్యార్థులు, ముఖ్యంగా తక్కువ ఆదాయ కుటుంబాల వారు, ఇప్పటికే కళాశాల ఖర్చులు, ప్రైవేట్ ట్యూషన్ ఫీజుల వల్ల ఇబ్బందులు పడుతున్నారు' అని నీతి ఆయోగ్ సరిగానే పేర్కొంది. దీని ఫలితంగా దిగువ కులాలు, వ్యవసాయ కుటుంబాల పిల్లలు, ముఖ్యంగా అమ్మాయిలు మధ్యలోనే చదువులు ఆపేస్తున్నారని ఇప్పటికే అనేక నివేదికలు ప్రకటించాయి. అయితే దీని మూలాలను నీతి ఆయోగ్ పట్టించుకున్నట్లు లేదు. సరళీకరణ విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు మోయలేని భారంగా మారిన విద్యా వ్యాపారాన్ని గూర్చి ఈ నివేదిక ఒక్క మాట పేర్కొనలేదు. ఈ కుటుంబాల ఆర్థికశక్తి పెరగడానికి కీలకమైన భూ పంపిణీ, స్థిరమైన, భద్రతతో కూడిన ఉద్యోగాలు లేని స్థితిని పాలకుల విధానాల్లో భాగంగా ఈ నివేదిక పట్టించుకోలేదు. చాలామంది విద్యార్థులు ఇలా ఖర్చుపెట్టే పరిస్థితి లేనందున తమ కుటుంబాలను పోషించుకోవడానికి గ్రాడ్యుయేషన్ తర్వాత తక్కువ జీతం ఉన్నప్పటికీ ఏదో ఒక ఉద్యోగం లేదా ఆదాయం సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్నారనేది వాస్తవం. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని కార్మికులను చౌకగా దోచుకుంటున్నారు. 2014-15 నుండి 7.67 కోట్లకు పైగా యువతకు నైపుణ్య ఆధారిత శిక్షణ ఇచ్చినట్లు చెప్పిన ఈ నివేదిక 'ఇలా ఎక్కువ మందికి శిక్షణ ఇవ్వడంపై కాకుండా, నైపుణ్యాలు ఉద్యోగాలకు, అధిక వేతనాలకు, కెరీర్ పురోగతికి దారితీసేలా చూడటంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది' అని పేర్కొనడం ద్వారా కంపెనీల అవసరాల కోసం నైపుణ్యం అని స్పష్టమౌతోంది. ఆరవ తరగతి నుంచే ఉపాధి, వ్యవస్థాపక నైపుణ్యాల కోర్సులను ప్రవేశపెట్టడం, అప్రెంటిస్‌షిప్‌లను (పనిలో శిక్షణ) ఉపాధికి ప్రాథమిక మార్గంగా మార్చడం, అధికారిక డిగ్రీ అవసరం లేని విధంగా నైపుణ్యాలకు ప్రాధాన్యతనివ్వాలని చేసిన సిఫార్సులు సామాజిక అంతరాలను మరింతగా పెంచేలా ఉన్నాయి. సంపన్నులకు నాణ్యమైన విద్య, ఉన్నతమైన ఉద్యోగాలు, పేద, మధ్యతరగతి వారికి అప్రెంటిస్‌షిప్ విద్య, తక్కువ వేతనాల వ్యవస్థను బలపరచేలా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌లో వివిధ మంత్రిత్వ శాఖలు నైపుణ్య శిక్షణ కోసం రూ.34,000 కోట్లను కేటాయించాయని "ఫలితాలు మాత్రం అస్థిరంగా ఉన్నాయి" అని ఈ నివేదిక పేర్కొనడాన్నిబట్టి నైపుణ్యాన్ని నేర్పే పని నుండి ప్రభుత్వం తప్పుకుంటుందనే సందేహం బలపడుతుంది. ప్రైవేట్ కంపెనీల ప్రయోజనాలకు అనుగుణంగా ఇప్పటికే అనేక రంగాల్లో అమలు చేస్తున్న కాలం చెల్లిన (ఎక్స్‌పైరీ) మందుగా వున్న పిపిపి విధానాన్నే నైపుణ్య శిక్షణ, ఉపాధి సమస్యకు పరిష్కారంగా చూపిన నీతి ఆయోగ్ 'ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా, అలాగే అప్రెంటిస్‌షిప్‌లను కలిగి ఉండే డిగ్రీలు, డిప్లొమాల ద్వారా ఉన్నత విద్యలో పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచాలి' అని చెప్పింది. విశ్వవిద్యాలయాలు సాధారణ డిగ్రీలకు బదులుగా, పరిశ్రమల-అనుసంధాన కోర్సులను ఎక్కువగా అందించాలని సూచించింది. ప్రస్తుతం 12వ తరగతి (ఇంటర్మీడియట్) స్థాయిల్లో వున్న విద్యాలయాల్లో వృత్తి విద్యా సబ్జెక్టులను నేర్పుతున్నవి నూటికి ఒకటికన్నా తక్కువ వున్నాయని, దీన్ని సరిదిద్దాలని పేర్కొంది. దీనికి పరిష్కారంగా ఆరవ తరగతి నుండి ఇంటర్ వరకు ఉన్న విద్యార్థులందరికీ జనరల్ ఎంప్లాయబిలిటీ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్స్ (జి.ఇ.ఇ.ఎస్)ను నేర్పాలని ప్రతిపాదించింది. విద్య, ఉపాధి మధ్య అప్రెంటిస్‌షిప్ విధానం కీలకమైనదని, అది సరిగా అమలు కావడం లేదని, అన్ని స్థాయిల్లో ఈ విధానం అమలు చేయాలని నీతి ఆయోగ్ ప్రకటించింది. ఈ విధానాన్ని గతంలోనే ప్రధాని ప్రకటించారు. దాని అనుభవం ఏమిటో నీతి ఆయోగ్ చెప్పకుండా దాటవేసింది. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (ఎన్.ఎ.టి.ఎస్)ను ప్రారంభించి రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలను కూడా ఇందులోకి తీసుకురావాలని చెప్పింది. కార్మికులను దేశవ్యాప్తంగా సమీకరించుకోవడానికి, ఏకీకృత విద్యా విధానం అనే కేంద్ర ప్రభుత్వ విధాన అమలులో భాగంగా ఈ సిఫారసు ఉంది. "శ్రామికులు, యువత నైపుణ్యాలను తిరిగి నేర్చుకోవడం, స్వయం ఉపాధి మార్గాలు పొందడం, స్థానిక డిమాండ్, అభివృద్ధి చెందుతున్న రంగాలకు అనుగుణంగా ఉండే శిక్షణల ఎంపికల అవసరం చాలా వుంద"ట! మహిళల్లో నైపుణ్యాన్ని పెంచడానికి సాయంత్రం, వారాంతం, హైబ్రిడ్, పార్ట్-టైమ్ ద్వారా శిక్షణ ఇచ్చే పద్ధతులను చేపట్టాలని, ఇప్పటికే ఉపాధి పొందుతున్న కార్మికులు నైపుణ్య సర్టిఫికేషన్ కోర్సులు లేదా పరిశ్రమకు అవసరమైన ఇతర ట్రైనింగ్‌ల కోసం ఒకటి నుండి మూడు నెలల వరకు వేతనం లేని సెలవు తీసుకునే అవకాశాన్ని పరిశ్రమలు కల్పించాలని ఈ నివేదిక 'ఉదారంగా' ప్రతిపాదించింది.

# గట్టు గ్రామపంచాయతీలో భారీ కుంభకోణం..
# రూ. 22 లక్షల ప్రజాధనం మాయం!




నిధులు కనబడితే చాలు.. తీర్మానం అక్కర్లేదు, బిల్లుతో పనే లేదు! సర్పంచ్‌లు మారినా, స్పెషల్ ఆఫీసర్లు మారినా పంచాయతీ నిధులను 'నమిలేసే' నైజం మాత్రం మారలేదు. గట్టు గ్రామపంచాయతి లో ఏకంగా రూ.22 లక్షల ప్రజాధనం పక్కదారి పట్టిన వ్యవహారంపై డీఎల్పీఓ, ఎంపీఓలు రంగంలోకి దిగడంతో అవినీతి తిమింగలాల గుండెల్లో రైళ్లు పరిగెడు తు న్నాయి. ఎవరికి వారే యథాశక్తి 'చేతి వాటం'! అధికారుల విచారణలో వెలుగు చూసి న అక్రమాల చిట్టా చూస్తే పంచాయతీ ఖజానా ను ఎంత దారుణంగా దోపిడీ చేశారో అర్థమవు తోంది.

పాత సర్పంచ్ పర్వం..

గత సర్పంచ్ హయాంలోనే అక్రమాలకు గండిపడింది. కనీస లెక్కాపత్రం లేకుండా ఏకంగా రూ.7.90 లక్షలు గుటుక్కుమనిపించారు. కార్యదర్శుల కక్కుర్తి పాలకవర్గం లేని స్పెషల్ ఆఫీసర్ పాలనలో ముగ్గురు కార్యదర్శులు చేతులు కలిపి రూ.7 లక్షల నిధులను నిలువునా ఊడ్చేశారు. కొత్త పాలకవర్గం దోపిడీ మేము మాత్రం తక్కువ తిన్నామా అన్నట్లు బాధ్యతలు చేపట్టిన ఎనిమిది నెలల్లోనే ప్రస్తుత సర్పంచ్ రూ.5 లక్షలు డ్రా చేసి రికార్డులను పాతరేశారు.

రికార్డులు మాయం!

ప్రమాణస్వీ కారానికి 'జలసా' చివరకు ప్రమాణస్వీకారం పేరుతోనూ ప్రజాధనం నుంచి రూ.90 వేలు దండుకోవడం వీరి తెంపరితనానికి పరాకాష్ట! గ్రామసభలకు మంగళం రికార్డులు మాయం! ఎనిమిది నెలల్లో కనీసం ఒక్కటంటే ఒక్క గ్రామసభతో మమ అనిపించి, నిధుల వినియోగాన్ని ప్రజల నుంచి పూర్తిగా దాచిపెట్టారు. విచారణలో అధికారులు రికార్డులు, తీర్మానాలు చూపాలని నిలదీస్తే బాధ్యుల వద్ద సమాధానం కరువైంది. బాధ్యుల పై వేటు తప్పదు!" ప్రజాధనం అస్మదీయుల పాలు కావడంపై సమగ్ర విచారణ జరుగు తోంది. రెండు రోజుల్లో కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. రికార్డులు దాచినా, నిధులు మళ్లించినా ఎంతటి వారిపై నైనా చర్యలు తప్పవని డి ఎల్ పి ఓ పేర్కొన్నారు.

# ట్రాఫిక్ చలాన్లు కట్టకపోతే ఫాస్టాగ్ నుంచి డబ్బులు కట్..

హైదరాబాద్ రోడ్లపై ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించి ప్రయాణించే వాహనదారులకు భారీ షాకిచ్చే దిశగా ట్రాఫిక్ పోలీసులు కీలక అడుగులు వేస్తున్నారు. వాహనాలపై పదుల సంఖ్యలో చలాన్లు, వేల రూపాయల పెండింగ్ ట్రాఫిక్ జరిమానాలు ఉండటంతో.. యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. వాహనదారులను ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చేసేందుకు చలాన్ ఫైన్లను భారీగా పెంచినప్పటికీ.. భారీగా బకాయిలు పెరిగిపోతున్నాయి తప్ప వాహనదారులు ట్రాఫిక్ ఉల్లంఘనల తీరు మాత్రం మారడం లేదు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగర పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను పాటించని.. ట్రాఫిక్ చలాన్లు చెల్లించని వారి జేబులకు చిల్లు వేసేందుకు ట్రాఫిక్ పోలీసులు రెడీ అయ్యారు. ఒక వాహనంపై ఉన్న ట్రాఫిక్ చలాన్ల మొత్తాన్ని ఆ వాహనం ఫాస్టాగ్ అకౌంట్ నుంచి కట్ చేసే ప్రతిపాదనలు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్ల వసూళ్లను సులభతరం చేయడంతో పాటు.. ట్రాఫిక్ ఉల్లంఘనలను తగ్గించేందుకు ఫాస్టాగ్‌తో చలాన్ల వ్యవస్థను అనుసంధానం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే ట్రాఫిక్ ఉల్లంఘనలకు విధించే జరిమానాను సంబంధిత వాహనదారుడి ఫాస్టాగ్ ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా మినహాయించే అవకాశం ఉంటుంది. దీనివల్ల వాహనదారులు మరింత జాగ్రత్తగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్.. ఈ ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అమెరికాలో ఉద్యోగం వదిలేసి.. రైతు కుటుంబాల రాత మార్చేశాడు.. రూ. 600 కోట్ల 'అక్షయకల్ప' విజయ ప్రస్థానం!

'నా భార్య బైబిల్ చదవడం తప్పా.. నా కొడుకు కోర్టుకు వెళ్లాడు.. నా దగ్గర ఆధారాలున్నాయి'.. వీడియో రిలీజ్ చేసిన జోగి రమేష్ రాయలసీమలో నిరుద్యోగ యువత కోసం 'స్టార్టప్ హబ్'.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైవెళ్లే పని లేకుండా ప్లాన్ ఫాస్టాగ్ ద్వారా ట్రాఫిక్ చలాన్ల వసూలు చేసే అంశంపై హెచ్ఎండీఏ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అయితే ఈ విధానం అమలుకు సంబంధించిన తుది నిర్ణయం, నిబంధనలు, సాంకేతిక అనుసంధానంపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలను కెమెరాలు, ఇతర టెక్నాలజీ వ్యవస్థల ద్వారా గుర్తించి వాహనాలకు ఈ-చలాన్లను జారీ చేస్తున్నారు. అయితే చాలామంది వాహనదారులు జరిమానాలను చెల్లించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారని పోలీసులు గుర్తించారు. దీంతో చలాన్ల వసూళ్ల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఫాస్టాగ్ వ్యవస్థతో ట్రాఫిక్ ఈ-చలాన్లను అనుసంధానం చేస్తే జరిమానా విధించిన తర్వాత నిర్దేశిత నిబంధనల ప్రకారం మొత్తాన్ని ఆటోమేటిక్‌గా వసూలు చేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల పెండింగ్ చలాన్ల సంఖ్య తగ్గడంతో పాటు, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే ముందు వాహనదారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే.. ఫాస్టాగ్ అనేది ప్రధానంగా ఫోర్ వీల్స్, ఆపైన భారీ వాహనాలకు మాత్రమే ఉంటుంది. కానీ బైక్‌లు, ఆటోలు వంటి వాహనాలకు ఫాస్టాగ్ ఉండదు. ఈ నేపథ్యంలోనే ఆ వాహనాలకు ఈ విధానం ఎలా వర్తిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అలాగే ట్రాఫిక్ చలాన్ మొత్తాన్ని ఎప్పుడు కట్ చేస్తారు.. వాహనదారులకు ముందుగా సమాచారం ఇస్తారా తప్పుగా విధించిన చలాన్లపై అప్పీల్ చేసే అవకాశం ఉంటుందా వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు రావాల్సి ఉంది. హైదరాబాద్‌లో పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీ, అక్రమ పార్కింగ్, రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రజా రవాణాను బలోపేతం చేయడం, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రధాన ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలను పెంచడం వంటి చర్యలు కూడా అవసరమని సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.

హైదరాబాద్‌లో ట్రాఫిక్ చలాన్లను ఫాస్టాగ్ అకౌంట్ నుంచి కట్ చేయడం వాహనదారులపై ఎలా ప్రభావం చూపుతుందని మీరు భావిస్తున్నారు? మీ అభిప్రాయాన్ని కామెంట్ బాక్స్‌లో పంచుకోండి.క్లిక్ చేసి కామెంట్ చెయ్యండి

# రాజీనామాకు కొండా నో...

కానీ దీనికి ససేమిరా అనేలా ఉన్నారు కొండా సురేఖ. ఇది సాధ్యం కాకపోతే గవర్నర్ ద్వారా మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయించేందుకు మరో అవకాశం ఉంది. ఇక మూడో పరిష్కార మార్గంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణను ప్రయార్టీలోకి తీసుకోనుంది అధిష్టానం. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తూ వస్తున్న మంత్రి వర్గ విస్తరణను పెండింగ్‌లో పెట్టేసింది అధిష్టానం.

ఇప్పుడు కొండా సురేఖపై వేటు ఉదంతం నేపథ్యంలో దీన్ని తెరపైకి తేవడం మూలంగా.. ఆమెను తొలగించి.. కొత్త వారికి చాన్స్ ఇస్తే సరిపోతుందనే ఆలోచన కూడా అధిష్టానం చేస్తుందని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కేబినెట్‌లో రెండు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. కొండా పదవి ఖాళీ అవడంతో మూడు మంత్రి పదవులకు అవకాశం దొరకనుంది. ఇంకా ఒకరిద్దరిని తప్పిస్తారని ప్రచారం జరిగినా..ఈ వివాదం నేపథ్యంలో ఇతరుల మంత్రి పదవుల జోలికి పోయే పరిస్థితులు లేవంటున్నారు. దీంతో ఖాళీగా ఉన్న మూడు బెర్తులకు గాను ఒక బీసీ, ఎస్టీతో పాటు ఓసీకి అవకాశం ఇవ్వొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఆది శ్రీనివాస్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం ద్వారా మున్నూరుకాపు సామాజికవర్గానికి సమన్యాయం చేసినట్టవుతందనే ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎస్టీ జాబితాలోని లంబాడా వర్గానికి ఈ కేబినెట్‌లో చాన్స్ దొరకలేదు.

ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి ఓ ఎస్టీ కి చాన్స్ ఇవ్వాలని చూస్తున్నారు. ఇక ఓసీల జాబితాలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లా నుంచి బోధన్ ఎమ్మెల్యే పీ సుదర్శన్‌రెడ్డి మంత్రి పదవులు ఆశించిన వారిలో ప్రధాన రేసులో ఉన్నారు. వీరిలో కోమటిరెడ్డి తనకు పదవి ఇవ్వాల్సిందేనని అసమ్మతి రాగం వినిపిస్తున్న నేపథ్యంలో.. అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఆసక్తి నెలకొన్నది. సుదర్శన్‌రెడ్డి ఇక రాజకీయాలకు గుడ్‌బై చెప్పనున్నారు. ఇదే ఆయనకు ఆఖరు టర్మ్. కానీ మంత్రి పదవి వచ్చేలా లేదని, కేబినెట్ ర్యాంకుతో కూడిన ప్రభుత్వ సలహాదారు పదవిని అప్పగించారు సీఎం రేవంత్‌రెడ్డి, మల్‌రెడ్డి కూడా ఈ మధ్య మంత్రి పదవి విషయంలో కొంత తగ్గినట్టు కనిపిస్తున్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఇటీవల రాహుల్‌గాంధీని కలిసి రావడంతో ఆయనకు బెర్త్ ఖాయమనే ప్రచారం జరిగింది.

# నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు బిగ్ అలర్ట్!

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ మరియు సమన్వయ కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నేపాల్‌లో ఉన్న తెలంగాణ వాసులకు అవసరమైన సహాయం అందించేందుకు తెలంగాణ భవన్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూఖా), ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయంతో పాటు ఇతర సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నారు. నేపాల్‌లో ఉన్న తెలంగాణకు చెందిన యాత్రికులు, పర్యాటకులు లేదా ఇతర వ్యక్తులతో సంప్రదింపులు జరపలేకపోతున్న కుటుంబ సభ్యులు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చు. సహాయక చర్యల సమన్వయాన్ని సులభతరం చేసేందుకు సంబంధిత వ్యక్తుల పేరు, పాస్‌పోర్ట్ వివరాలు, మొబైల్ నంబర్, నేపాల్‌లో ప్రస్తుతం ఉన్న లేదా చివరిగా తెలిసిన ప్రాంతం, ట్రావెల్/టూర్ ఆపరేటర్ వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు వివరాలను హెల్ప్‌లైన్ అధికారులకు అందించాలి.

హెల్ప్‌లైన్ నంబర్లు
శ్రీమతి వందన
పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్ ఉ లైజన్ హెడ్
మొబైల్: 9871999044
సి.హెచ్. చక్రవర్తి
పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్
మొబైల్: 9949351270
జి. రక్షిత్ నాయక్
లైజన్ ఆఫీసర్
మొబైల్: 9618597969

# అసమ్మతి అధిష్టానంపై...

## అసంతృప్తి మీడియాపై! మీడియాను - టార్గెట్ చేస్తే పలుచనయ్యేది లీడర్లే..

మీడియా మీద సంయమనం కోల్పోవడం మూలంగా మీడియా సంస్థలకు వచ్చే నష్టమేమీ ఉండదు.. పైగా ఇలాంటి కామెంట్స్ వాటికి ఆయాచిత ప్రచారం చేసి పెట్టినట్టే. మాతో పెట్టుకుంటే పత్రిక నడవనివ్వం.. చానెల్‌ను కొనసాగనివ్వమనే బెదిరింపు దోరణిని కూడా ఎవరూ హర్షించరు. ఎందుకంటే.. ఏదో ఒక ఫేక్ వార్త బాధించి ఉండొచ్చు గాక, దీన్ని ఖండించడం, విమర్శించడం వరకు ఓకే. కానీ ఆ మీడియా మూలాలనే పెకిలిస్తామనే దోరణి విపరీత పోకడల కిందనే జమ కడతారు తప్ప.. పెద్దగా ఆమోదమైతే లభించదు. గతంలో కేసీఆర్ కూడా టీవీ9 విషయంలో ఇలాంటి కామెంట్ చేశారు. ఏబీఎన్‌ను కూడా బ్యాన్ చేస్తామని హెచ్చరించారు. ఇది కూడా వీరావేశంలో భాగంగానే చూస్తారు.. బాగా స్పందించారని జనాలకు అప్పటికప్పుడు కనెక్టవుతుంది కాబోలు.. కానీ, అంతిమంగా ఇది లాంగ్‌రన్ పోరాటం చేసే అంశం కాదు. మధ్యలోనే వదలేసేది. కానీ మీడియా మాత్రం కాచుకు కూర్చుంటుంది.. ఎప్పుడు దొరుకుతారా? ఎలా డ్యామేజీ చేయాలా? తోకను బట్టుకుని పడగ అని రాసేందుకు ఎప్పుడూ రెడీగానే ఉంటుంది. ప్రజా జీవితంలో ఉన్నవారికి ఇలాంటి తగవులు చికాకునే తెప్పిస్తాయి తప్ప.. పరిష్కార మార్గాలు మాత్రం కాబోవు. రేవంత్ సీఎం కాగానే సోషల్ మీడియాకు వార్నింగ్ ఇచ్చారు. యూట్యూబర్లను అసెంబ్లీ సాక్షిగా బట్టలిప్పి కొడతానన్నారు. దీని వల్లా ప్రయోజనం లేదు. చట్టపరమైన చర్యలు సైలెంట్‌గా తీసేసుకుంటే సరిపోతుంది. కానీ బాహాటంగా ఇచ్చే ఇలాంటి వార్నింగులు రెచ్చగొట్టేవే తప్ప.. సమస్య సమిసిపోయేలా చేసేవైతే కావు. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే వాస్తవానికి విరుద్ధంగా పోయే టీవీ చానెళ్లు, పేపర్లు. కల్పిత వార్తలను వండి వార్చే కంటెంట్‌లతో నెట్టుకురావాలని చూసేవి.. కొన్ని రోజుల పాటు జనాలను రంజింపజేస్తుండొచ్చు.. వారిని ఆకట్టుకుని ఉంటుండొచ్చు. కానీ పదే పదే ఇవే వార్తలను ప్రసారం చేస్తూ.. ప్రచారంలా వాడుకుంటే.. ఇందులో తన సొంత ఎజెండాను జొప్పించి.. వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తుంటే..అది పాఠకులకు, వీక్షకులకు అర్థమైపోతుంది. ఆ తరువాత వారే దాన్ని పక్కన పడేస్తారు. జనం నీ కన్నా తెలివైనోళ్లు.. బాబు.. ఒక విషయాన్ని వారు చూసే కోణం, ఏం జరుగుతోంది.. పరిణామాల అర్థమేమిటో పసిగట్టడంలో ఉద్దండులు.. మీ జర్నలిస్టులు కూడా పనికిరారు ఈ విషయంలో..! పొద్దున్నే ఓ సీనియర్ లీడర్ అన్న మాటలు ఇక్కడ ప్రస్తావనర్హంలా అనిపిస్తోంది.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక

గురువారం
27 -08-2026

# నేటి నుండి బోధన్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ లో భాగంగా గ్రామ సభలు.

## సద్వినియోగం చేసుకోవాలి.
## బోధన్ ఆర్డీవో విజయ కుమారి కోరారు.



బోధన్ ప్రతినిధి,ఆగస్టు 26: (ప్రజా గళం) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బోధన్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లోని గ్రామాలతో పాటు జిల్లా వ్యాప్తం గాహోఆగస్టు 27న గ్రామ సభలు నిర్వహించనున్నట్లు బోధన్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, (ఈఆర్ఓ),రెవెన్యూ డివిజనల్ అధికారి విజయకుమారి తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయడమే లక్ష్యమని ఆమె అన్నారు.గ్రామ సభల్లో డ్రాఫ్ట్ ఓటరు జాబితాను బహిరంగంగా చదివి వినిపించనున్న ట్లు తెలిపారు.అలాగే గ్రామ సభల్లో మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు,నివాసం మారిన ఓటర్ల వివరాలు,డబుల్ ఎంట్రీగా నమోదైన ఓటర్ల గుర్తింపు,గైర్హాజరైన ఓటర్ల జాబితా తదితర వివరాలను ప్రజలకు వెల్లడించనున్నట్లు ఆర్డీవో విజయకుమారి తెలిపారు.ప్రతి ఓటరు, గ్రామ ప్రజలు ఈ గ్రామ సభలను తప్పనిసరిగా సద్విని యోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఓటరు జాబితాలో తమ పేరు,చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉన్నా,పేరు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నా గ్రామ సభలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాల ని సూచించారు.గ్రామ సభల్లోహొబిఎల్ఓ లు, బిఎల్ ఓ సూపర్వైజర్లు,గ్రామ పంచాయతీ కార్యదర్శులు,రెవె న్యూ సిబ్బంది తదితర అధికారులు పాల్గొని నోటీసుల జారీ,విచారణ ప్రక్రియ, అభ్యంతరాల నమోదు విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించను న్నట్లు తెలిపారు.సరైన ఓటరు జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకమని, ప్రతి ఒక్కరూ SIR ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను సరిచూసుకోవాల ని విజయకుమారి విజ్ఞప్తి చేశారు.

# నలంద హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు ఇంగ్లీష్ మంత్ర శిక్షణ



ఆర్మూర్,ఆగస్టు 26 ఆర్మూర్ లోని మామిడి పల్లి లోగల నలంద హైస్కూల్‌లో ఉపాధ్యాయుల ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'ఇంగ్లీష్ మంత్ర ట్రైనింగ్ ప్రోగ్రామ్' నిర్వహించారు. ట్రైనర్ అజయ్‌జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో తరగతి గదిలో ఇంగ్లీష్‌ను సమర్థవంతంగా వినియోగించడం, సరైన ఉచ్చారణ, ఆత్మవిశ్వాసంతో మాట్లాడటం, విద్యార్థులతో మెరుగైన ఇంగ్లీష్‌లో సంభాషించడం వంటి అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు అవసరమైన అంశాలను నేర్చుకున్నారు. ఈ సందర్భంగా నలంద హైస్కూల్ యాజమాన్యం రాజేంద్రప్రసాద్, సాగర్ లు ట్రైనర్ అజయ్‌జీకి కృతజ్ఞతలు తెలిపారు.ఉపాధ్యాయులు తమ కమ్యూనికేషన్ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించింది.

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ట్రావెల్స్ బస్సులోని ఆరుగురు మృతి.. పలువురికి గాయాలు..

సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కోదాడ మండలం దొరకుంట శివారులో ఆగిఉన్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. ఈ ఘటన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. కాగా.. ఈ ఘటనలో ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురు మరణించారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం సమయంలో ట్రావెల్స్ బస్సులో 42మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నట్లు తెలిసింది. అయితే, చికిత్స పొందుతున్న వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో బస్సులో సీట్ల మధ్య కొందరు ప్రయాణికులు ఇరుక్కుపోయారు. వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా హైదరాబాద్ -- విజయవాడ మార్గంలో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే, ప్రమాదానికి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమా..? అతివేగం కారణమా అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బస్సు వేగంగా వచ్చి కంటైనర్ ను బలంగా ఢీకొనడంతో ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్లకు గౌరవం.. రేవంత్ రెడ్డిని కలిసిన గాయత్రి-త్రిసా

క్రీడాకారులు వెళ్లగా, ముఖ్యమంత్రి వారికి ఘనంగా స్వాగతం పలికారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ కీర్తి ప్రతిష్టలను పెంచిన ఈ ఇద్దరు యంగ్ షట్లర్లను సీఎం రేవంత్ రెడ్డి శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో జరిగే ప్రతిష్టాత్మక పోటీలలో మరింతగా రాణించి మరిన్ని బంగారు పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.వి లక్ష్మి పాల్గొని క్రీడాకారులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# సాటాపూర్ గేట్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాస్తారోకో.

## తక్షణమే యూరియా యాప్ రద్దు చేసి పూర్వపద్ధతిలోనే యూరియా ఇవ్వాలి....రైతులు,నాయకులు డిమాండ్....

ఎడపల్లి,ఆగస్టు 21: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రం శివారులో ని సాటాపూర్ గేట్ వద్ద గురువారం బోధన్ - నిజామా బాద్ ప్రధాన రహదారిపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు,నాయకులు,కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు.సుమారు 20 నిమిషాల పాటు నిర్వహించిన రాస్తారోకో వల్ల బోధన్ - నిజామాబాద్ వైపు వెళ్ళు వాహనాల రాకపోకలు నిలిచి పోవడంతో ట్రాఫిక్ స్థంభించి పోయింది.రాస్తారోకో నిర్వహిస్తున్న స్థలానికి ఎస్ఐ రేణుక,పోలీస్ సిబ్బంది చేరుకొని రాస్తా రోకోను విరామింప చేశారు.అనంతరం పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపిపి కొండెం గల శ్రీనివాస్,మండల పార్టీ నాయకులు దుబ్బాక రవీందర్ గౌడ్,ఆకుల శ్రీనివాస్ లు విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు ఎరువుల విక్రయం కోసం ప్రవేశ పెట్టిన యూరియా యాప్ తో గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,స్మార్ట్ ఫోన్ లేక కొందరు,యాప్ తెలియక అనేక మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.కష్టపడి యాప్ ద్వారా ఎరువులు బుకింగ్ చేసుకున్న రైతులకు సహకా ర సంఘాల ద్వారా ఎరువులు ఇవ్వకుండా,వారికి ఎరువులతో పాటు ఇతర మందులు కొంటేనే ఎరువులు ఇస్తామంటూ మెలిక పెట్టి రైతులను ఆర్థికంగా నష్టపరు స్తున్నారని ఆరోపించారు.

ఈ విషయం వ్యవసాయశాఖ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని అన్నారు.రైతులకు యాప్ ద్వారా ఎరువులతో పాటు ఇతర ఉత్పత్తులు తీసుకోవాలని లింక్ పెడుతున్న సహకార సంఘాల పనితీరును నిరసిస్తూ,రాస్తారోకో నిర్వహించారు.తక్షణమే ఎరువుల బుకింగ్ యాప్ ను రద్దు చేయాలని,ఎరువుల కొంటే ఇతర మందులు కూడా కొనాలని మెలిక పెడుతున్న సహకార సంఘా లపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గైని పోచయ్య, బిఆర్ఎస్ నాయకులు నాగేందర్ రెడ్డి,రాజిరెడ్డి,గడ్డం శ్రీనివాస్, ఆకుల సురేష్.మహెందర్ రెడ్డి, మల్క స్వామి,ఎంబ రాజేశ్వర్, మల్కన్న,యాదగిరి గౌడ్, సురేష్ గౌడ్,అరుగుల నాగరాజు, మదుగౌడ్, కిష్టపురం రవి,మియా జానీ,యూసుఫ్, షేక్.జావీద్ (బాబా), దశరథ్, పాషా ఖాన్,రవిగౌడ్,స్వామి, అల్తాఫ్, జీవన్ రెడ్డి,అల్తాఫ్, లాయక్ అలీ,ముస్తాక్,హస్సేన్, బర్దిపూర్ ప్రవీణ్,అంబం అబ్బయ్య,గిర్ని గంగప్రసాద్, పలువురు పార్టీ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 6న ఏఆర్పీ క్యాంప్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం.

## సమ్మేళనంకు విచ్చేసే పూ ర్వ విద్యార్థులు కార్యక్రమం విజయవంతం చేయాలి.- పూర్వ విద్యార్థులు పిలుపు.



ఎడపల్లి,ఆగస్టు 26: (ప్రజా గళం): నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఏఆర్పి క్యాంప్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ప్రతి ఒక్కరు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చెయాలనీ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం పూర్వ విద్యార్థులు పిలుపు నిచ్చారు.బుధవారం ఏఆర్పీ క్యాంప్ గ్రామంలోని ప్రభు త్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విలేకరుల సమావే శం నిర్వహించారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 6 వ తేదీన ఆదివారం ఉద యం 10 గంటలకు సమ్మేళనం కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.విద్యార్థుల కోలాహ లం,పండుగ వాతావరణంలో అందరు కలిసి మెలసి విద్యార్థి యొక్క దశలో అల్లర్లు చేసుకోవడానికి ప్రతి ఒక్కరు తప్పకుండా రావాలి అని కోరారు.ఏ పనిలో ఉ న్న,ఏ కార్యక్రమంలో ఉన్న వాయిదా వేసుకోవాలని, ఈ సమ్మేళనం మళ్ళీ మళ్ళీ రాదు కాబట్టి ఒక్కరోజు సమయం కేటాయించాలని అన్నారు.ఆసియా ఖండం లోని అతిపెద్ద నిజాం సుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం ఆధ్వర్యంలో కార్మికులు,ఉద్యోగుల పిల్లల కోసం సౌక ర్యాలు కల్పించే దిశగా ఏఆర్పి క్యాంప్ లో పాఠశాలను 1959 లో నెలకొల్పడం జరిగింది అని,అప్పుడు టీచర్ల కు ఎన్ఎస్ఎఫ్ అరకొర జీతాలు ఇచ్చేవి అని గుర్తు చేశారు.1994 నుండి పాఠశాలకు ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలగా మారింది అని,వరుసగా ఒకటవ తరగతి నుండి ఒక్కొక్క తరగతి పెరుగుతూ హెచ్ ఎస్ సి తర్వాత 10వ తరగతి వరకు తరగతులు విస్తరించబ డ్డాయన్నారు.జూనియర్ కళాశాల కూడా ఏర్పాటు చేద్దామనుకునారు.కానీ అప్పుడున్న ప్రధానోపాధ్యా యులు,మరి కొందరు టీచర్ లు,పాఠశాలను వదిలి వెళ్లిపోవడం జరిగింది అన్నారు.2001లో నిజాంషుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం నుండి ప్రభుత్వ పాఠశాలకు పూర్తిగా బదిలీ చేయడం జరిగింది.మన పాఠశాలకు అత్యధిక 26 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా స్వర్గీ య మద్దూరి అన్నపూర్ణయ్య ఉన్నారని గుర్తు చేశారు. ఎక్కువమంది పూర్వ విద్యార్థులకు హెడ్మాస్టర్ అంటే అన్నపూర్ణే సార్ అని తెలుసు మనందరికీ,గురువులు మన పాఠశాలను అపూర్వంగా తీర్చిదిద్దారు.తర్వాత కొత్త ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు,ఆరు సంవత్స రాలు హెడ్మాస్టర్ గా పని చేశారని పూర్వ విద్యార్థులు తెలిపారు.ఐదు సంవత్సరాలు టీవీఎన్ ఎన్.ప్రసాద్ రావు హెడ్మాస్టర్ గా పనిచేశారని,టి.నరసింహారాజు 3 సంవత్సరాలు,1 సంవత్సరం తెలుగు పండిట్ టి సాంబమూర్తి హెడ్మాస్టర్ గా పనిచేశారని వివరించారు. విజయనంద రావు హెడ్మాస్టర్ గా 3 సంవత్సరాలు పని చేశారు.కేసి లింగన్న హెడ్మాస్టర్ గా ఐదు సంవత్సరాలు పనిచేశారు. టీ.కోటేశ్వరరావు 3 సంవత్సరాలు పని చేశారని అన్నారు.బి.గంగాధర్ 5 సంవత్సరాలు,వి. నరేందర్ ఇన్చార్జ్ హెడ్మాస్టర్ గా 5 సంవత్సరాలు,పి. రమేష్ రెండు సంవత్సరాలు హెడ్మాస్టర్ గా పని చేశార న్నారు.పాఠశాల చుట్టుపక్కల గ్రామాలు బ్రాహ్మణపల్లి, వడ్డేపల్లి, అంబం(వై),దుబ్బా తండా,జైతాపూర్,జమలం,పెంటాకలాన్,బర్దిపూర్,భూలక్ష్మి క్యాంప్,పెగడపల్లి, సాటాపూర్,నీల క్యాంప్,కందకుర్తి,వీరన్నగుట్ట,ఎడపల్లి గ్రామాల విద్యార్థులే కాక,ఇతర ప్రాంతం నుంచి కూడా వాళ్ళ బంధువుల వద్ద ఉండి చదువుకున్న వారు కూ డా అనేక మంది విద్యార్థులు ఉన్నారని.మరొకసారి 65 సంవత్సరాల ఈ అపూర్వ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు..

# నూతన తరం యువత ఎమ్మార్పిఎస్ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలి.

## మన దేశంలో ఉన్న అసమాన తులను తొలగించాలి.
## ఎమ్మార్పిఎస్ నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మాసాయి పేట యాదగిరి మాదిగ పిలుపు..

ఎడపల్లి,ఆగస్టు 26: (ప్రజా గళం) ఎడపల్లి మండల ఎంఆర్పిఎస్,ఎం.ఎస్.పి అనుబంధ సంఘాల సమావేశము ఎడపల్లి మండల కేంద్రం శివా రులోని సాటాపూర్ గేట్ వద్ద ఎమ్మార్పిఎస్ బోధన్ నియోజకవర్గ ఇంచార్జి లసింగారి భూమయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పిఎస్ మండల సీనియర్ నాయ కులు భాస్కర్ మాదిగ సభాక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో నూతన తరం యువకులతో ఎమ్మార్పి ఎస్-ఎంఎస్ పి ఎడపల్లి మండల నూతన కమిటీల నియామకం కొరకై ఇంచార్జీలను ప్రకటించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మార్పి ఎస్ నిజామాబాద్ జిల్లా ఇంచార్జీ మాసాయి పేట యాదగిరి మాదిగ మాట్లాడుతూ..మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పిఎస్,ఎంఎస్ పి అనుబంధాల సంఘాల బలోపేతం చేసే క్రమంలో నిజామాబాద్ జిల్లాలో గ్రామ స్థాయి నుండి ఉద్యమా న్ని బలోపేతం చేయడానికి ప్రయత్నాలు జరుగుతు న్నాయని అన్నారు.ఇందులో భాగంగానే బోధన్ నియో జకవర్గంలోని ఎడపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పి ఎస్,ఎంఎస్ పి అనుబంధ సంఘాలతో సమావేశం నిర్వహించడం జరిగింది అని అన్నారు.

భవిష్యత్తులో మాదిగల హక్కుల సాధన కోసం ఉద్యమం చెపడతా మని,30 సంవత్సరాల ఎమ్మార్పిఎస్ ఉద్యమ కాలం లో,మంద కృష్ణ నాయకత్వంలో మాదిగల హక్కుల సాధనకై అనేక పోరాటాలు చేయడం జరిగింది అని అన్నారు.ఎమ్మార్పిఎస్ ను చైతన్యం చేస్తూ,వర్గీకరణ ద్వారా మాదిగలకు రావాల్సిన అనేక సంక్షేమ పథకాల ను రాబట్టుకునేందుకు నేడు గ్రామ స్థాయిలో కమిటీల ను ఏర్పాటు చేస్తూ ముందుకు వెళుతున్నట్లు అయన చెప్పారు.ఈ రాష్ట్రంలో అగ్రకుల పార్టీలు తమ తమ ఉనికిలను కాపడుకుంటున్నప్పుడు,మాదిగలకు ఏ రాజకీయ పార్టీ లేకపోవడం వల్ల,ఇతర పార్టీలలో మాది గలు పనిచేయడాన్ని గుర్తించి,అణగారిన వర్గాలకు, నిమ్నజాతి వర్గాలకు మహనీయుల స్ఫూర్తితో డాక్టర్. బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితోటి,అణగారిన వర్గా లకు కచ్చితంగా రాజకీయ పార్టీ ఉండాలనే లక్ష్యంతోటి మహాజన సోషలిస్ట్ పార్టీని మందకృష్ణ మాదిగ స్థాపిం చడం జరిగింది అని అన్నారు.ఒకవైపు మాదిగ దండో రా,మరొక వైపు సోషలిస్టు పార్టీ రెండు కళ్ల లెక్క,ఈ సమాజంలో నిలబెట్టాల్సిన భాద్యత ఎమ్మార్పిఎస్ నాయకులపై ఉందని స్పష్టం చేశారు.ఈ సందర్బంగా అన్ని రాజకీయ పార్టీలకు దీటుగా,అన్ని సంఘాలకు దీటుగా,ఎమ్మార్పిఎస్ ముందు వరుసలో ఉండాలని అన్నారు.నూతన తరం యువత ఎమ్మార్పిఎస్ ఉద్య మంలో భాగస్వామ్యం కావాలి అని,మన దేశంలో ఉన్న అసమానతులను తొలగించాలి అని సూచిస్తూ,పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న వరంగ ల్ లో జరగబోయే జాతీయ సభను విజయవంతం చేయాలని మాదిగలకు పిలుపునిచ్చారు. ఎడపల్లి మం డల ఇన్చార్జిలు భాస్కర్ మాదిగ,తాడెం అబ్బయ మాదిగ,పెరవలి నాగభూషణం మాదిగ,కొండ్ర పాండు మాదిగ,సంజీవ్ మాదిగ లను ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాదిగ మహిళ సమాఖ్య జాతీయ కోర్ కమిటీ సభ్యురాలు యమున మాదిగ,రాష్ట్ర ప్రధా న కార్యదర్శి పద్మ మాదిగ,సావిత్రి మాదిగ,సుధా మాదిగ,సాయిలు,సంజీవ్,మారుతి మాదిగ తదితరు లు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక

గురువారం
27 -08-2026





# నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు.

### కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలి
### గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలి.
### ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్,
### టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.

నిజామాబాద్ ఆగస్టు 26 (ప్రజాగళం ప్రతినిధి ): నిజామాబాద్ పట్టణంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగగా, అనంతరం ఖిలా రోడ్డు, నెహ్రూ పార్క్‌లో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్‌లు మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.

మతాల మధ్య ఐక్యతే తెలంగాణ బలం: షబ్బీర్ అలీ.

ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. మనిషిని మనిషిగా గౌరవించడం, ప్రేమించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని అన్నారు.కులం, మతం, ప్రాంతం పేరుతో మనుషుల మధ్య విభేదాలు సృష్టించుకోవద్దని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ సమాజం ఎప్పటి నుంచో కులమతాలకు అతీతంగా కలిసి జీవించే గొప్ప సంస్కృతిని కలిగి ఉందని, ఈ సామరస్యాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రవక్త మహమ్మద్ చూపిన శాంతి, కరుణ, సహనం, సోదరభావం మార్గంలో సమాజం ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సెక్యులర్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే పార్టీ అని షబ్బీర్ అలీ అన్నారు. కులం, మతం, భాష, ప్రాంతం అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించడం కాంగ్రెస్ పార్టీ విధానమని తెలిపారు. తెలంగాణలో ప్రతి పౌరుడు ప్రశాంతంగా, గౌరవంగా జీవించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీలో పెద్ద సంఖ్యలో వేలాది గా ,ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్. నుడాచైర్మన్ కేశ వెణు , శేఖర్ గౌడ్, నరాల రత్నాకర్ , జావిద్ అక్రమ్, కుద్దూస్, హారున్, కార్పొరేటర్లు సజ్జాద్ రహీల్, నయీమ్ షారాన్, అబ్దుల్ కరీం, అబుద్ బిన్ హందన్, అన్వార్, మొహమ్మద్ అహ్మద్, కో ఆప్షన్ మెంబెర్ మహేందర్ సింగ్, ఆసిఫ్, వహీద్, మీలాద్ కమిటీ అధ్యక్షులు ష?యైబ్ రజా, మహమ్మద్ అబ్బు రజా, రషీద్ రాజా, ముజహిద్ ఖాన్, పాప ఖాన్, జావీద్ ఖాన్, కయ్యూమ్, షబ్బీర్ రాజ్జాక్, జఫర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మొయిన్, సమీ, రియాజుదిన్, సఫ్దర్, అఫ్రోజ్ ఖాన్, సాదిక్ సోహైల్, షైక్ మహబూబ్, పర్వేజ్, ఈసా,మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణలో పెట్టుబడుల జోరు

-ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్ రూమ్
-నిపుణులతో ప్రత్యేక కమిటీల ఏర్పాటు
-దేశ, విదేశాల్లో రోడ్ షోలు
-పెట్టుబడిదారులకు ఆహ్వానాలు

హైదరాబాద్:ఆగస్టు 26: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026–ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం నాడు మహాత్మా పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు. ?సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు.

డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్



పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# ధరణితోనే అనేక భూ సమస్యలు.. గత ప్రభుత్వంపై వీహెచ్ ఫైర్

హైదరాబాద్:ఆగస్టు 26: గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈరోజు(బుధవారం) గాంధీభవన్‌లో ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు.ఈరోజు ముఖాముఖి కార్యక్రమంలో.. భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవన్నారు. గత ప్రభుత్వం.. ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకొచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు ఇందిరా గాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని.. రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని వి.హనుమంతరావు సూచించారు.వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నారని వీహెచ్ అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమెరికాలో సాధ్యమని.. భారత దేశంలో కాదన్నారు. ప్రధాని మోదీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సంబంధాలు ఉన్నాయని.. అందుకే భారత్‌ను అమెరికాలా చేయాలని మోదీ చూస్తున్నారని అన్నారు. భారత్ సెక్యులర్ దేశమని.. ఇక్కడ వన్ నేషన్ వన్ ఎలక్షన్ సాధ్యం కాదని చెప్పారు. భారత దేశంలో భిన్న మతాలు, భిన్న కులాల ఉన్నాయన్నారు. కేంద్రం చేస్తున్న క్యాస్ట్ సెన్స్, కులగణనలో బీసీల కాలమే లేదని తెలిపారు. అలాంటిది వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎక్కడిదని ప్రశ్నించారు. 70 శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. ముందు బీసీల సంగతి తేల్చాలన్నారు. 'మేము వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. కులగణన పేరుతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ఓట్లకు, ఈసీ లెక్కలకు తేడా ఉ



# తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'

2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత.. స్పోర్ట్స్ బడ్జెట్ కేటాయింపులు పెరిగాయని, ఖేలో ఇండియా వంటి పథకాల ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఉన్న క్రీడా ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. 'ఖేలో ఇండియా' స్కీమ్‌లో భాగంగా.. తెలంగాణలో కూడా దాదాపు రూ.30 కోట్లతో క్రీడా సదుపాయాల కల్పన జరిగిందని, అందులో రూ.11.5 కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సింథటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్ట్, మహిళల కోసం ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలను కల్పించారని, మరో రూ.18.5 కోట్లతో రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో క్రీడా సదుపాయాలను కల్పించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో 33 ఖేలో ఇండియా సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మరో రూ.8.5 కోట్లను తెలంగాణలో క్రీడాభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఖేలో ఇండియా స్కీమ్, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ , అసిస్టెన్స్ టు నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ , స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్కీమ్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలనిస్తున్నాయి. తెలంగాణకు చెందిన అంతర్జాతీయ బాక్సర్ నిఖత్ జరీన్.. టాప్స్ ప్రోగ్రామ్ సహాయంతో ఇవాళ భారతదేశ కీర్తిపతాకను రెపరెపలాడిస్తోంది. ఈ పథకం ద్వారా ఆమెకు అత్యాధునిక శిక్షణతోపాటుగా అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని అనుభవం గడించేందుకు ప్రోత్సాహం లభించింది. తెలుగు తేజం.. బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా.. టాప్స్ కార్యక్రమం ద్వారా.. అంతర్జాతీయ స్థాయి శిక్షణ, సపోర్టింగ్ స్టాఫ్ సహకారంతో.. ఒలింపిక్స్ మెడల్ సాధించింది. క్రీడారంగంలో ఆమె రాణిస్తున్న తీరును ప్రోత్సహిస్తూ.. కేంద్ర ప్రభుత్వం 2015లో పద్మశ్రీ, 2020లో పద్మభూషణ్ అవార్డును అందించింది. ఇలాంటి క్రీడాకారులెందరికో.. కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 2014కు ముందు మొత్తం 23 ఒలింపిక్స్ ఎడిషన్లలో.. 23 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 వరకు మూడు ఎడిషన్లలో 15 పతకాలు సాధించాం. పారాలింపిక్స్‌లోనూ.. 2014కు ముందు దేశం కేవలం 8 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 పారాలింపిక్స్ లో.. 52 పతకాలు సాధించాం. 2014కు ముందు దేశంలో స్పోర్ట్స్ బడ్జెట్ రూ.1,219 కోట్లుండగా.. 2025–26లో ఇది రూ.3,794 కోట్లకు పెరిగింది. దేశంలో 2014కు ముందు రూ.191 కోట్ల విలువైన 38 స్పోర్ట్స్ ప్రాజెక్టులుండగా.. ఈ 12 ఏళ్లలో 350 స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు పూర్తయ్యాయి. వీటి విలువ రూ.3,181 కోట్లు. మరో వైపు, ఆగస్టు 29న నేషనల్ స్పోర్ట్స్ డే ను పురస్కరించుకుని.. గురువారం . దేశవ్యాప్తంగా 'ఖేల్ కీ బాత్, పీఎం కే సాథ్' పేరుతో ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి.. 2 కాలేజీల చొప్పున 1,500 లకు పైగా కాలేజీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్రీడలు, ఫిట్‌నెస్‌తో పాటు యువత నేతృత్వంలో దేశ నిర్మాణానికి సంబంధించిన అంశాల మీద ప్రధాని మోదీ.. వర్చువల్‌గా ప్రసంగించడంతోపాటు క్రీడల పట్ల యువత ఆలోచనలు, ఆకాంక్షల గురించి వారితో మాట్లాడి తెలుసుకోనున్నారు.

# తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'




హైదరాబాద్:ఆగస్టు 26)భారతదేశ యువశక్తికి సరైన క్రీడా సదుపాయాలను, అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించి.. వారిలోని శక్తిసామర్థ్యాలకు పదునుపెట్టడంతోపాటుగా వారికి క్రీడా రంగంలో ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. అందుకోసం గత 12 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలతోపాటు పథకాలను తీసుకొచ్చింది.'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా.. దేశంలోని యువ క్రీడాశక్తిని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా.. 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్', 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్', 'ఖేలో ఇండియా పారా గేమ్స్', 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్', 'ఖేలో ఇండియా బీచ్ గేమ్స్', 'ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్', 'ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్' వంటి క్రీడా పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను, తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు జరిగిన 24 ఎడిషన్ల 'ఖేలో ఇండియా ' పోటీల్లో దేశం నలుమూలల నుంచి 60 వేల మందికిపైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పరంపరలో భాగంగా.. ఈ ఏడాది జరగనున్న 8వ ఎడిషన్ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' ను తెలంగాణలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికగా ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఎడిషన్‌లో మొత్తం 25 క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రమైన తెలంగాణ.. ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించవచ్చు. దీంతో పాటుగా మరో కొత్త క్రీడను కూడా ఈ ఈవెంట్లో ఆడించనున్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 6వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా. ఈ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' నిర్వహణకోసం.. కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లను విడుదల చేసింది. ఈ క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఖేలో ఇండియా పథకం అడ్‌హక్ కమిటీ, స్టీరింగ్ కమిటీల సంయుక్త నిర్వహణలో నిర్వహించనున్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణకు కేటాయించడం పట్ల.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ధన్యవాదాలు తెలియజేశారు. భారత యువతలో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, వారికి తగిన క్రీడా సదుపాయాలు కల్పించడం, అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడం, ప్రతిభను వెలితీయడంలో గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. స్పోర్ట్స్ బడ్జెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు.

# ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనంతో దారితప్పిన మైనర్లు.

హైదరాబాద్:ఆగస్టు 26: హైదరాబాద్ రీన్‌బజార్‌లో రాత్రివేళ ఇంట్లో చోరీకి పాల్పడిన ఇద్దరు బాలురను టాస్క్‌ఫోర్స్, రీన్‌బజార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ.18 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.యాకుత్‌పురాకు చెందిన 16, 15 ఏళ్ల ఇద్దరు బాలురు ఈ చోరీకి పాల్పడ్డారు. ఇద్దరూ విద్యార్థులేనని పోలీసులు తెలిపారు. ఆగస్టు 22న రీన్‌బజార్ పోలీసులకు ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించారు. అనుమానితుల కదలికలపై నిఘా పెట్టి ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో.. గేమింగ్ జోన్లకు వెళ్లి డబ్బులు ఖర్చు చేయడం, వ్యక్తిగత అవసరాలకు నగదు కొరత ఏర్పడటంతో విలువైన వస్తువులు, నగదు చోరీ చేయాలని ప్లాన్ చేసినట్లు బాలురు వెల్లడించారని పోలీసులు తెలిపారు.ఆగస్టు 21వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఇద్దరు బాలురు ఓ ఇంటి గేటుకు తాళం వేసి ఉండటాన్ని గమనించారు. ఇంట్లో ఎవరూ లేరని భావించి లోపలికి ప్రవేశించారు. అనంతరం ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలతో పాటు భారతీయ, విదేశీ కరెన్సీని చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com